# ఏ.పి.ఆన్‌లైన్, తపాల శాఖల ద్వారా ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ లైఫ్ సేవలు

హైదరాబాద్, జనవరి 9

ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ తన వ్యాపార విస్తరణలో భాగంగా, ఖాతాదారులకు మరింత సరళమైన సేవలు అందించేందుకు ప్రభుత్వ నిర్వహణ లోని ఏపి ఆన్‌లైన్, తపాలా శాఖల ద్వారా ఒక వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఆ సంస్థ గ్రామీణ ప్రాంత వ్యాపార విభాగపు సీనియర్ ఉపాధ్యక్షుడు రిషి శ్రీవాత్సవ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు ఇక మీదట తమ ప్రీమియం చెల్లింపులను రాష్ట్రం లోని 730 ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా, 382 తపాలా శాఖల ద్వారా చెల్లించవచ్చునని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో సంస్థ కార్యకలాపాలను విస్తరింపచేసేందుకు అందుబాటులో ఉన్న వివిధ వనరులను ఉపయోగించుకుని తద్వారా ఖాతాదారులకు మరిన్ని విలువ ఆధారిత సేవలు అందచేసేందుకు నిర్ణయించినట్లు వివరించారు. ఈ మాదిరి వ్యూహాత్మక ఒప్పందాలను రాజస్తాన్ ఆన్‌లైన్ సేవా సంస్థ ఈ-మిత్రతోనూ, కేరళ లోని సౌత్ ఇండియన్ బ్యాంక్‌తోనూ, గుజరాత్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన తపాలా శాఖలతోనూ కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరిలో గ్రామీణ ప్రాంతం నుండి వచ్చే వ్యాపారం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,




మీడియా సమావేశంలో పాల్గొన్న రిషీ శ్రీవాత్సవ, పక్కనే సంస్థ జోనల్ మేనేజర్ అజయ్‌కపూర్

గత ఏడాది చివరి వరకు ఈ విభాగంలో 100 కోట్ల రూ.ల విలువైన వ్యాపారం జరిగిందని చెప్పారు. 2000 సంవత్సరంలో బీమా రంగంలో ప్రైవేట్ సంస్థలను అనుమతించినప్పుడు మొదటగా ఏర్పాటైనది తమ సంస్థేనని, గణనీయప్రగతితో ముందుకు సాగుతున్న తమ సంస్థకు దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో 260 కార్యాలయాలు ఉన్నాయని చెప్పారు.

అలాగే 20 వేల మంది బీమా సలహాదారులు తమతో పనిచేస్తున్నారని, ఖాతాదారులు తమ ప్రాంతీయ భాషలోనే దరఖాస్తులు పూర్తి చేసే సౌకర్యాన్ని కలిగించడంతో పాటు, ఇతర సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు వీలుగా కాల్‌సెంటర్లను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు తమకున్న 60 లక్షల మంది ఖాతాదారుల ద్వారా 3,684 కోట్ల రూ.ల ప్రీమియం వసూలు అయిందని, గ్రామీణ పట్టణ ప్రాంతాలన్నీ కలిపి 1048 కార్యాలయాలు కలిగి ఉన్నామని, మొత్తం 2,36,000 వేల మంది బీమా సలహాదారులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తమకు ట్రిబుల్ ఏ రేటింగ్‌కు వచ్చిందని, ఈ విధమైన రేటింగ్ కలిగిన ప్రైవేట్ బీమా సంస్థలు దేశంలో మరేవీ లేవని చెప్పారు.